క్లుప్తంగా

నేటినుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


చెన్నకేశవస్వామి దేవాలయం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. శనివారం ధ్వజారోహణ, ఆదివారం పొన్నమాను సేవ, సోమవారం హనుమంతు సేవ, మంగళవారం గరుడసేవ, బుధవారం కల్యాణోత్సవం జరుగుతుంది. 26వ తేదీ శుక్రవారం వసంతోత్సవం, 27వ తేదీ ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కళ్యాణోత్సవం, రథోత్సవానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ బ్రహ్మోత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలతో పాటు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ సర్పంచ్


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ కొండయ్య

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని జనార్దనపురం మాజీ సర్పంచ్ ఇండ్ల కొండయ్య గురువారం దుత్తలూరు పార్టీ క్యాంపు కార్యాలయంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో ఉంటే బీసీలకు న్యాయం జరగదని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమైందని, అందుకే తాను వైఎస్సార్‌సీపీలో చేరినట్లు కొండయ్య తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి విజయం కోసం పూర్తి స్థాయిలో పని చేస్తానని చెప్పారు.

మాన్యం భూముల గోల్‌మాల్‌పై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బిట్-1 ఎంపీటీసీ అల్లూరురాజు

సీతారామపురం: సీతారామపురం సర్వే నంబరు 536-1లో మాన్యం భూముల గోల్‌మాల్‌పై గురువారం బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు తహసీల్దార్ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో ఆ భూముల పీర్ల మాన్యంగా ఉన్నాయని, వాటిని కొందరు అక్రమార్కులు వారి పేర్లపై డీ-ఫారం పట్టా, అసైన్‌మెంట్ పాస్ బుక్‌లు అక్రమంగా పొందారని ఆరోపించారు. ఇటీవల వాటిని కొందరు రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో అనుభవ స్వభావం కింద దరఖాస్తుగా ఉంటే వాటి స్థానంలో కొనుగోలుగా మార్పు చేశారన్నారు. దీంతో అక్రమార్కులు మాన్యం భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని, రూ.కోట్ల విక్రయానికి సిద్ధం చేశారన్నారు. స్పందించిన తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

తొలి రోజు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్


నామినేషన్లకు సంబంధించి నోటిఫికేషన్ నోటీసు బోర్డులో అంటించిన అధికారులు

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్ నామినేషన్ నోటిఫికేషన్ ప్రచురించారు. ఈ నేపథ్యంలో మొదటి రోజు జలదంకి మండలానికి చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉన్నందున ప్రత్యేక డీఎస్పీ సాయినాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, అనూష, తిరుపతయ్య పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరులో ఒక్క నామినేషన్ దాఖలు

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఆత్మకూరు ఆర్‌ఓ, ఆర్డీఓ కె మధులత ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. తొలి రోజు యుగ తులసి పార్టీ తరపున చేజర్లకు చెందిన నెల్లూరు కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

అట్టహాసం.. నామినేషన్ పర్వం

- వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నామినేషన్ దాఖలు
- నాలుగు సెట్ల నామినేషన్లు అందజేత
- కనీవినీ ఎరుగని రీతిలో తరలివచ్చిన అభిమాన జనవాహిని
- కళుగోళమ్మ ఆలయంలో పూజలు, చర్చి, మసీదుల్లో ప్రార్థనలు


కళుగోళమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పర్వం ఆద్యంతరం అట్టహాసంగా సాగింది. వేలాది మందిగా తరలివచ్చిన అశేష జనవాహిని, అభిమానుల కేరింతలు, కోలహలం నడుము ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి నడుమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రజాభిమానంతో వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై న ప్రతాప్‌కుమార్‌రెడ్డి మూడో దఫా కూడా వైఎస్సార్‌సీపీ తరపున ఫ్యాన్ గుర్తుపై పోటీ చేస్తూ నామినేషన్ దాఖలు చేయడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. నామినేషన్‌లో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని అల్లూరు, దగదర్తి, బోగోలు, కావలి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో నేల ఈనినట్లు జనం తరలివచ్చారు. ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా కావలి గ్రామదేవత కళుగోళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తర్వాత నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే నివాసం నుంచి కావలి గ్రామదేవత కళుగోళమ్మ ఆలయం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల మేర జనవాహినితో ఉదయం ఏడు గంటల నుంచే పట్టణ ప్రధాన రహదారి నిండిపోయింది.

కళుగోళమ్మకు పూజలు, చర్చి, మసీదుల్లో ప్రార్థనలు

ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. ఇంటి వద్ద ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఆయన సోదరి సోమేశ్వరమ్మ, కుమార్తె సంహిత విజయ తిలకం దిద్దగా కుటుంబ సభ్యులతో కలిసి కావలి గ్రామదేవత కళుగోళమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు, వేదపండితుల ఆశీర్వచనాల అనంతరం అభిమానులతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి బయలుదేరారు. అంతకు ముందు స్థానిక చర్చిలో, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో ప్రార్థనల అనంతరం పాస్టర్లు, యువత పూలబొకేలు అందించి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. మసీదులో ముస్లిం మత పెద్దలు ప్రార్థనల

నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు

వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండు సెట్లు, ఆయన సతీమణి ఆదిలక్ష్మి మరో రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కందుకూరు ఎన్నికల పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డితో కలిసి కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శీనానాయక్‌కు నామినేషన్ల పత్రాలు అందజేశారు. అడుగుడుగునా అభిమానులు అవధులు లేని అభిమానాన్ని కనబరిచారు. వేలాది మందిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, భారీ గజమాలలతో స్వాగతిస్తూ, గుమ్మడి కాయలతో దిష్టితీస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఆర్డీవో కార్యాలయం బయటే మండుటెండలో జనాలు వేచి ఉన్నారు. నామినేషన్ పూర్తయి బయటకు వచ్చిన తరువాత ప్రతాప్ రెడ్డిని భుజాలపైకి ఎక్కించుకుని జయహో నినాదాలు చేశారు.

అడుగడుగునా అవధులు లేని అభిమానం

గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి దర్పణంగా కావలి చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజలు తమ అభిమానాన్ని చాటుకుంటూ నామినేషన్ ఘట్టానికి తరలివచ్చారు. ఉదయం పది గంటల సమయానికి సుమారు 30 వేల మంది తరలివచ్చారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు ఆర్డీఓ కార్యాలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించాల్సి వచ్చింది. ఆర్డీఓ కార్యాలయం నుంచి ముసునూరు వరకు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో గ్రామాల నుంచి నామినేషన్‌కు ఆటోల్లో వస్తున్న అభిమానులు చాలా మంది పట్టణంలోకి ప్రవేశించలేకపోయారు. హైవేపైనే వేచి చూసి ఉసూరుమంటూ వెనుదిరిగారు. దగదర్తి, బోగోలు, అల్లూరు మండలాల నుంచి ఆటోలు, సొంత వాహనాల్లో వస్తున్న మరో ఐదు వేల మంది వరకు పట్టణంలోకి రాలేక వెనుదిరిగారు.


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి


జెండా, హోర్డింగ్‌లు, సీఎం, ఎమ్మెల్యే దంపతుల ఫొటోలతో కోలాహలం


పూలజల్లు కురిపిస్తున్న యువత కేరింతలు


భారీ ర్యాలీలో ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి


చర్చిలో ప్రార్థనలు అనంతరం ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పాస్టర్లు, యువత

చరిత్రలో నిలిచిపోయే విజయం ఖాయం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి చరిత్రలో నిలిచిపోయే మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రతాప్‌కుమార్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బీద విలేకరులతో మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రమంతా మళ్లీ ఫ్యాన్ గాలి తుఫాన్‌లా వీయడం ఖాయమన్నారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటేనే రాబోయే మెజార్టీ ఎంత ఉంటుందో అర్థమవుతుందన్నారు.

ఫ్యాన్‌కు పట్టం కట్టడమే ప్రజల ఆకాంక్ష

- మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావడమే ప్రజల ఆకాంక్ష అని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఫ్యాన్ గాలే వీస్తుందన్నారు. కావలిలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మండుటెండలు కూడా లెక్క చేయకుండా ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు తరలివచ్చిన వేలాది మంది ప్రజలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర భవిష్యత్, పేదల జీవితాలు బాగుపడాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు.

చరిత్రాత్మక మెజారిటీ సాధించడమే లక్ష్యం

- మన్నెమాల సుకుమార్ రెడ్డి, కందుకూరు పార్టీ పరిశీలకులు

కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయి రెడ్డిని గెలిపించుకోవడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ కందుకూరు ఎన్నికల పరిశీలకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజల్లో అపూర్వ ఆదరణ

- వేణుంబాక సునందారెడ్డి
- మహిళా నేతలతో కలిసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: గత కొద్ది రోజులుగా మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో పాటు ప్రచారంలో ప్రజల స్పందన అపూర్వంగా ఉందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి అన్నారు. పట్టణంలో తన కుమార్తె నేహారెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి తల్లి మేకపాటి మణిమంజరి, స్థానిక నాయకులతో కలిసి 9, 10 వార్డులోగురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామదేవత అంకమ్మ మాను వద్ద మహిళా నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో, అభ్యర్థుల తరపున కరపత్రాలను అందజేసి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరు జగనన్నను ఆశీర్వదించాలని, ఈ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడేలా ఓటర్లే స్టార్ క్యాంపెయినర్లుగా మారి ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం అందజేసిన సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇళ్లకే అందేలా చేయడంతో లబ్ధిదారులు ప్రభుత్వంపై సానుకూల ధోరణి స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ నెలలో టీడీపీ కుట్రతో పింఛన్లు ఇంటికి అందజేయకపోవడంతో తమకు తిరిగి కష్టాలు మొదలవుతాయోనన్న భయం వారి మాటల్లో తెలిసిందని, అయితే తాము తిరిగి జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేసుకుంటామని దృఢ నిశ్చయంతో ఉన్నట్లు తెలపడం విశేషమని ఆమె వివరించారు. పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుందన్నారు.


ఆత్మకూరులో విలేకర్లతో మాట్లాడుతున్న వేణుంబాక సునందారెడ్డి, మేకపాటి మణిమంజరి

రాళ్లదాడికి పాల్పడడం దారుణం

- మేకపాటి మణిమంజరి

రాష్ట్రంలో విశేష ప్రజాదరణతో దిగ్విజయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల కుట్రతో విజయవాడ సమీపంలో రాళ్లదాడికి పాల్పడడం దారుణమని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సతీమణి మణిమంజరి అన్నారు. ఎన్నికల్లో ఏ పార్టీకి చెందిన వారైనా వారి పార్టీల గురించి ప్రచారాలు చేసుకోవాలే తప్ప ఇలా దాడికి పాల్పడడం మంచిది కాదన్నారు. ప్రజల ఆదరణ కోల్పోయిన టీడీపీ ఇక గెలవబోదని వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలాంటి పిచ్చిపనులు చేయడం మానుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు పుచ్చలపల్లి రాధిక, కోడూరు కౌసల్యమ్మ, తుమ్మల త్రివేణి, నోటి విజయజ్యోతి, కొండా స్వరూపరాణి, తిరుపతమ్మ, గుడి సంధ్య, సయ్యద్ నౌషాద్‌బేగం, ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ అల్లారెడ్డి అనసూయమ్మ, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సీహెచ్ మంజూష, తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు గజ వాహన సేవ




ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతా, లక్ష్మణ సమేత రామచంద్రుల స్వామిని గజ వాహనంపై విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా గజవాహనోత్సవం

ఆత్మకూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పంటవీధి కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా వేడుకలు నడుమ పండరీ భజన బృందాలు ముందు సాగుతుండగా గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

విజయసాయిరెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ



వింజమూరు (ఉదయగిరి): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గురువారం నెల్లూరులోని పార్టీ క్యాంపు కార్యాలయంలో వింజమూరు మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితులపై విజయసాయిరెడ్డి ఆరా తీశారు.

ఎన్నికల ప్రచారంలో డీలర్


కాకర్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గణేశ్వరపురం రేషన్ డీలర్

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురం రేషన్‌షాపు డీలర్ పేరం భాగ్యలక్ష్మి ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో పార్టీ కండువా ధరించి హారతి ఇస్తున్నట్లు ఉన్న ఫొటోలు, వీడియో గురువారం నుంచి సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. కాకర్ల మంగళవారం గణేశ్వరపురంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నేత భార్య అయిన పేరం భాగ్యలక్ష్మి పార్టీ కండువాతో ప్రచారంలో పాల్గొనడంపై గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం మండల ఎంపీడీఓ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ కృష్ణకుమారిని వివరణ కోరగా, తాము ఎలాంటి విచారణ చేయలేదని సమాధానం చెప్పకుండా దాట వేశారు.

తొలి ఘట్టానికే చేతులెత్తేసిన కావ్య

- నేడు ఒంటరిగా నామినేషన్ దాఖలు

కావలి: కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల ప్రక్రియలో తొలి ఘట్టానికే చేతులెత్తేశాడు. శుక్రవారం ఆర్భాటం.. హడావుడి లేకుండా సాధారణంగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రధానంగా అటు పార్టీ కేడర్, ఇటు మిత్ర పక్షాల మద్దతును కోల్పోయాడు. కావ్య ఎన్నికల వ్యవహారాలన్నీ తన గుమాస్తాల చేతుల్లో పెట్టడంతో అరకొరగా ఉన్న కేడర్ సైతం దూరం కావడంతో ఇటీవల చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు సైతం జనాన్ని సమీకరించలేక చతికిలబడ్డారు. ప్రచారానికి వచ్చిన చంద్రబాబు జనం లేక గంట పదినిమిషాలు హెలిప్యాడ్‌లోనే బస్సులో పడిగాపులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. తాజాగా నామినేషన్‌కు సైతం జనాలను పిలిచినా వచ్చే అవకాశాలు లేవని గ్రహించిన కావ్య ఆర్భాటం, హడావుడి చేసి ఆనాక అభాసుపాలవడం ఎందుకని ఒంటరిగానే వెళ్లి నామినేషన్ వేయాలని నిర్ణయించుకుంటున్నట్లు తెలుస్తోంది. కావ్య పోకడలతో 40 ఏళ్ల నుంచి పార్టీకి విధేయులుగా ఉన్న నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరు పార్టీ వీడారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడంతో టీడీపీతో సహా ఇతర పార్టీల నుంచి ఆ పార్టీలో ఊర్లకు ఊర్లు, ప్రాంతాలకు ప్రాంతాలే చేరుతున్నాయి. ప్రచారం ప్రారంభించిన పది రోజుల్లోనే కావ్యకు కావలి ఓటర్లు కొత్త పాఠం నేర్పించడంతో గెలుపు అసాధ్యమనే వాస్తవం అర్థం అయింది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు 30 వేల మందికిపైగా తరలిరావడంతో కావ్య పూర్తిగా చేతులెత్తేశాడు. పోటీ అనవసరం అనే ఆలోచనకు వచ్చినా.. తప్పదన్నట్లుగా ఒంటరిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. జనసమీకరణ చేయలేక నవ్వులపాలవడం అనవసరం అని భావించి శుక్రవారం ఒంటరిగానే సైకిల్ గుర్తుపై నామినేషన్ వేసి ఎన్నికలు మొక్కుబడిగా ముగించేద్దామనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఈవిషయం తెలుసుకున్న టీడీపీ అభిమానులు, కార్యకర్తలు తీవ్రంగా మండిపడుతున్నారు. పార్టీ జెండాలు తగులబెట్టే స్థాయిలో కార్యకర్తల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. మధ్యలోనే ఇలా అస్త్రసన్యాసం చేస్తే జనాల ముందు ఎలా తిరగాలంటూ ఆవేదన చెందుతున్నారు. మరో వైపు కూటమిలో భాగంగా కావ్యకు మద్దతు తెలిపిన పట్టణ బీజేపీ, జనసేన నాయకులు కూడా అంతర్మథనంలో పడ్డారు.

జనాల కట్టడికి కావ్య కుట్రలు

వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు జనాలు వెళ్లకుండా కట్టడి చేసేందుకు, నామినేషన్ సందర్భంగా అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, అతని అనుచరులు నీచమైన కుట్రలు పన్నినట్లు వెలుగుచూసింది. పట్టణంలోని పలు వార్డుల్లో టీ కప్పులు, సాసర్లతో కూడిన కిట్లు పంపిణీ చేసి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు వెళ్లొద్దని కోరినట్లుగా సమాచారం. యువతకు మద్యం కూడా భారీగా పంపిణీ చేసి గొడవలు సృష్టించే ప్రణాళికలు సిద్ధం పలుచోట్ల ప్రజలే అడ్డుకున్నారు. పోలీసులు కూడా రంగంలోకి దిగి కప్పులు, సాసర్ల కిట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. నామినేషన్‌కు ముందు రోజు బుధవారం మధ్యాహ్నం నుంచే టీడీపీ శిబిరం ద్వారా జనాలను రెచ్చగొట్టే పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముస్లింలు

సీతారామపురం: సీతారామపురంలో టీడీపీకి చెందిన 15 ముస్లిం మైనార్టీ కుటుంబాలు గురువారం స్థానిక నేతలు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పీసీ అల్లూరురాజు, హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తామంతా ఆది నుంచి టీడీపీ కార్యకర్తలమని, ఇకపై వైఎస్సార్‌సీపీ నేతలు నాయకత్వంలో పని చేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విజయసాయిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ముస్లిం మండల నాయకులు కరామతుల్లా, ఖలీల్‌అహ్మద్, మస్తాన్, ఖాజా, నాయబ్, తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రేనాటి సుధాకర్‌నాయుడు, పాణెం చంద్రమౌళి, వంకెల సుధాకర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

33 మంది వలంటీర్ల రాజీనామా

చేజర్ల: మండలంలో పలు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 33 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. యనమదల, కాకివాయి, చేజర్ల, పాడేరు గ్రామాలకు సంబంధించి వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి, ఆ పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి పక్షాల స్వార్థానికి, వేధింపులకు తాళలేక రాజీనామాలు చేస్తున్నామని, ప్రజలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తామన్నారు.

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లి సచివాలయ పరిధిలోని పది మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ అర్హత గల ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావు లేకుండా అందించాలనే దృఢసంకల్పంతో విధులు నిర్వహించామన్నారు. ప్రతిపక్షాల స్వార్థ రాజకీయానికి, ప్రజలకు సేవ చేయలేని ఉద్యోగాలు తమకు అవసరం లేదని భావించే రాజీనామా చేశామని, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విజయసాయిరెడ్డి విజయం కోసం పని చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం


వింజమూరు మండలం లెక్కలవారిపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న స్థానిక నేతలు


ఏఎస్‌పేట: కుప్పురుపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ప్రచార పర్వం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో స్థానిక నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు.


సోమశిల: చిలకలమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆత్మకూరురూరల్: పమిడిపాడు కాలనీల్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం